# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 18 సంచిక: 345 | మంగళవారం, 12 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



MHR TV
www.MHRtv.com


## కృష్ణా రివర్‌లో ఏపీ పెత్తనం..


**బోర్డులో తెలంగాణ అధికారులేరి?**

**1 ఈఈ, 4 ఏఈఈ పోస్టులు ఖాళీ**

- భర్తీపై దృష్టి సారించని తెలంగాణ
- బోర్డు ఏపీకి వెళ్తుందని ప్రచారం
- రాష్ట్ర అధికారుల విముఖత
- ఆంధ్రోళ్లతో నింపేలా పావులు
- రాష్ట్రానికి నష్టమంటున్న ఇంజినీర్లు

**హైదరాబాద్ ఆగస్టు 11 (ప్రజాస్వరం):** కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)లో ఏపీ పెత్తనమే కొనసాగుతున్నది. బోర్డులో తెలంగాణకు సంబంధించిన పోస్టులన్నీ సుదీర్ఘకాలం నుంచి ఖాళీగా ఉన్నా, వాటి భర్తీకి ప్రభుత్వం

..మిగతా 2లో



## ప్రజాపాలన అంటే ఇదేనా..?

- కలెక్టర్ ఎదుటే దారుణం
- దివ్యాంగుడిని ఈడ్చి వీల్‌చైర్ నుంచి పడేసిన కానిస్టేబుల్
- ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం.. "ప్రజాపాలన అంటే ఇదేనా?" ప్రశ్న
- బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్



2

## ఆయిల్ ఫార్మ్ పంట రహస్యం చెప్పిన సీతక్క

- ఆయిల్ ఫార్మ్ పంటకు ప్రత్యేక గ్యారంటీ.. రైతులకు లాభాలు
- మహిళలు, యువత కోసం ప్రభుత్వ ప్రత్యేక పథకాలు
- ములుగులో త్వరలో ఐటీ కంపెనీ శంకుస్థాపన
- పర్యాటక కేంద్రాల అభివృద్ధికి మంత్రి తుమ్మల హామీ



2

# సర్వహంగులతో 'రేవంత్ అతిథిగృహం'

**ఆగమేఘాలపై సాగుతున్న భవన నిర్మాణ పనులు**

- ఇప్పటికే మూడు రెట్లు పెరిగిన వ్యయం
- చాలా అతిథి గృహాలున్నా కొత్తది ఎందుకు?
- ఇందిరమ్మ ఇండ్లకు మాత్రం నిధుల కొరత
- మంజూరైన ఇండ్లనూ రద్దుచేస్తున్న వైనం
- అతిథిగృహ ఆర్భాటంపై విమర్శల వెల్లువ



**హైదరాబాద్ ఆగస్టు 11 (ప్రజాస్వరం):** ఓ వైపు పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను రకరకాల సాకులు చెప్తూ రద్దు చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం... అతిథి గృహం పేరుతో అవసరం లేకున్నా చేపట్టిన సీఎం క్యాంపు కార్యాలయం నిర్మాణ పనులు మాత్రం ఆగమేఘాలపై చేస్తున్నది. భవనానికి ఇంకా ఎలాంటి అదనపు హంగులు కల్పించాలి? అదనంగా ఎన్ని నిధులు అవసరమవుతాయి? అతిథిగృహం ఎప్పటిలోగా అందుబాటులోకి రావొచ్చు? అనే అంశాలపై ఇటీవల ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయడం గమనార్హం. ఎంతో కాలంగా సీఎం అధికారిక నివాసంగా ఉన్న ప్రగతిభవన్‌ను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి, మరో మంత్రి నివాసాలకు ఉపయోగిస్తున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో రేవంత్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం కోసం వివిధ

..మిగతా 2లో

## రాహుల్ గాంధీ అరెస్ట్.. ఢిల్లీలో హైటెన్షన్

- ఈసీ కార్యాలయానికి కూటమి ఎంపీల ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు.. ఖర్గే, అఖిలేశ్ యాదవ్ సహా పలువురి అరెస్ట్
- ప్రత్యేక బస్సుల్లో పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు



2

## మెట్రో ఆటోమేటెడ్ పార్కింగ్ రెడీ..

- మొత్తం 10 పార్కింగ్ అంతస్తులు, సినిమా థియేటర్లు
- దేశంలోనే తొలి ఆటోమేటెడ్ పార్కింగ్ కాంప్లెక్స్
- ప్రభుత్వ శాఖల అనుమతి లభించగానే ప్రారంభం
- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి



4

## దరఖాస్తులు తప్పితే దమ్మిడీ ఇచ్చింది లేదు..

- ఆగష్టు 13తో రైతు బీమా గడువు పూర్తి
- ప్రీమియం చెల్లిస్తే ఆగస్ట్ 14 నుంచి కొత్త పాలసీ
- రైతులు స్వీయ ధ్రువీకరణ తప్పనిసరి
- తిక్కలోడు తిరనాళ్లకు పోతే అంటూ కేటీఆర్ కౌంటర్



2

# విమర్శలను తిప్పికొట్టాలి

- అసెంబ్లీలో కాళేశ్వరం, బనకచర్లపై గళం విప్పాలి
- ఎమ్మెల్యేల అర్హతపై స్పీకర్ పై ఒత్తిడి పెంచాలి
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎండగట్టాలి
- బనకచర్ల, ఎమ్మెల్సీల అనర్హతపై సుప్రీంకోర్టుకెళ్లాలి
- బీసీరిజర్వేషన్లపై పోరాట పంథ
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కేటీఆర్, హరీష్ రావుతో పాటు సీనియర్ నేతలతో భేటీ



**హైదరాబాద్ ఆగస్టు 11 (ప్రజాస్వరం):** బీఆర్ఎస్ పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నేతలకు పిలుపు నిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇంకా రాద్ధాంతం చేస్తున్నారని, మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పియర్స్ కు మరమ్మతులు చేయకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని దీనిపై కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలని, విస్తృతంగా ప్రజలకు వివరించాలని సూచించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో సోమవారం మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తో భేటీ అయ్యారు. రాజకీయాలు, బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరం కమిషన్ రిపోర్టు, బనకచర్ల ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. నేతలకు దిశానిర్దేశం చేశారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై సుప్రీంకోర్టుకు వెళ్లే విషయంపై కూలంకుషంగా చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పార్టీ

..మిగతా 2లో

# దేశ స్థాయిలో తెలంగాణ గౌరవం నిలబెట్టాలి

- దేశ స్థాయిలో తెలంగాణ గౌరవం నిలబెట్టే పిలుపు
- సివిల్స్ మెయిన్స్ అభ్యర్థులకు ఆర్థిక సహాయం
- ఐఏఎస్ సేవలు సమాజాభివృద్ధికి ఉపయోగపడాలి
- నిబద్ధత, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచన



**హైదరాబాద్ ఆగస్టు 11 (ప్రజాస్వరం):** తెలంగాణ గౌరవాన్ని దేశ స్థాయిలో నిలబెట్టేందుకు యువత కృషి చేయాలని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్రానికి బలమైన మానవ వనరులు అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. సివిల్స్ - 2025 మెయిన్స్‌కు

..మిగతా 2లో

# దరఖాస్తులు తప్పితే దమ్మిడీ ఇచ్చింది లేదు..

- ఆగష్టు 13తో రైతు బీమా గడువు పూర్తి
- ప్రీమియం చెల్లిస్తే ఆగస్ట్ 14 నుంచి కొత్త పాలసీ
- రైతులు స్వీయ ధ్రువీకరణ తప్పనిసరి
- తిక్కలోడు తిరనాళ్లకు పోతే అంటూ కేటీఆర్ కౌంటర్



హైదరాబాద్ ఆగస్టు 11 (ప్రజాస్వరం): 'రైతు బీమా' పథకం పునరుద్ధరణకు గడువు దగ్గరపడింది. 202425 బీమా గడువు ఆగష్టు 13తో ముగుస్తుండగా.. 202526కి ప్రీమియం చెల్లిస్తే ఈ నెల 14 నుంచి కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. రైతు బీమా పథకంలో చేరే రైతులు స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంది. రైతులు తమతో పాటు నామినీకి చెందిన ఆధార్ కార్డు, పట్టా పుస్తకం దరఖాస్తుకు జతచేసి స్వయంగా వ్యవసాయశాఖ అధికారులకు ఇవ్వాలి. అర్జీలకు మరో మూడు రోజులే గడువు ఉండడంతో.. రైతులు తమ పనులు మానుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వంపై కౌంటర్ వేశారు. కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుందని, ఒక్క పథకమూ అమలు కావడం లేదన్నారు.

'తిక్కలోడు తిరనాళ్లకు పోతే ఎక్కా, దిగా సరిపోయిందని.. అసమర్ధ, అవివేక కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుంది తప్ప ఒక్క పథకమూ నిర్దిష్టంగా అమలు కావడం లేదు. భూమిని నమ్ముకున్న రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షలు ఆ కుటుంబానికి అందించే రైతుబీమా పథకం 2018 నుండి కేసీఆర్ గారి ప్రభుత్వం అమలుచేస్తూ వస్తున్నది. పథకం ప్రారంభించినప్పటి నుండి 2023 డిసెంబర్ వరకు 1,11,320 రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.5,566 కోట్ల పరిహారం అందించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబీమా ప్రీమియం చెల్లించకుండా జాప్యం చేయడం మూలంగా వేలాది మంది రైతు కుటుంబాలు బీమా సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రతి ఏటా ఆగష్టు 14తో రైతుబీమా ప్రీమియం గడువు ముగుస్తుంది. దీంతో ప్రభుత్వం ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయడం ఆనవాయితీ. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గడువు దగ్గరకు వచ్చిన తర్వాత రైతుబీమా కోసం రైతు స్వయంగా స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రం అందజేయాలని, తనతో పాటు నామినీ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు అందజేయాలని నిబంధన పెట్టారు' అని కేటీఆర్ మండిపడ్డారు.

'రైతుబీమా రెన్యువల్‌కు కేవలం మూడు రోజుల గడువు మాత్రమే ఉన్నది. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా నడుస్తున్నాయి. ఎరువులు దొరక్క రైతులు చెప్పులు, బుక్కులు లైన్లో పెట్టి పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటి కీలక సమయంలో రైతుబీమాకు తిరిగి స్వయంగా రైతులు దరఖాస్తు చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం మూర్ఖత్వం. గతంలో చేసినట్లే రైతుబీమా రెన్యువల్ చేయాలి. దరఖాస్తు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నది. కాంగ్రెస్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ప్రతిపక్షాలు, ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు.. ఎవరి మీద విసురుతారో తెలియని పరిస్థితి నెలకొంది. దండగమారి కాంగ్రెస్ పాలనలో దరఖాస్తులు తప్పితే సామాన్యులకు ఈ సర్కారు దమ్మిడీ విదిల్చింది లేదు. బోగస్ మాటలు, బ్రోకర్ వేషాలు తప్ప 20 నెలల కాంగ్రెస్ పాలనలో సామాన్యులకు, తెలంగాణకు ఒరిగిందేమీ లేదు. జాగో తెలంగాణ జాగో' అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# ఆయిల్ ఫార్మ్ పంట రహస్యం చెప్పిన సీతక్క

- ఆయిల్ ఫార్మ్ పంటకు ప్రత్యేక గ్యారంటీ.. రైతులకు లాభాలు
- మహిళలు, యువత కోసం ప్రభుత్వ ప్రత్యేక పథకాలు
- ములుగులో త్వరలో ఐటీ కంపెనీ శంకుస్థాపన
- పర్యాటక కేంద్రాల అభివృద్ధికి మంత్రి తుమ్మల హామీ



హైదరాబాద్ ఆగస్టు 11 (ప్రజాస్వరం): ములుగు జిల్లా మంజీరా ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క రైతులకు ఆయిల్ ఫార్మ్ పంట ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఆయిల్ ఫార్మ్ సాగుతో రైతులు మంచి లాభాలు పొందవచ్చు. 10 ఎకరాల భూమి ఉన్న రైతులు కనీసం ఐదు ఎకరాలలో ఈ పంటను సాగు చేయాలి. ఈ పంటకు ఉన్న గ్యారంటీ మరే పంటకు లేదు" అని తెలిపారు.

రైతుల భారం తగ్గించేందుకు సబ్సిడీతో ఒక్కో మొక్కను రూ.25కే అందిస్తున్నామని ఆమె వివరించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల మేలుకోరే ప్రభుత్వం. రైతులకు దేశంలో ఉచిత కరెంట్ ఇచ్చిన మొదటి రాష్ట్రం మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి కాంగ్రెస్ ప్రభుత్వమే. అలాగే దేశంలోనే మొదటిసారి రూ.70 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినది కూడా కాంగ్రెస్" అని గుర్తు చేశారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలకు వడ్డీ లేకుండా రుణాలు, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్భయ పథకం కింద ఎంపికైన 10 జిల్లాలలో ములుగు జిల్లా కూడా చోటు దక్కించుకుందని, త్వరలోనే జిల్లాలో ఐటీ కంపెనీ శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. ఈ నెల 18న మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసి, శాశ్వత భవనం ఏర్పాటుకు పునాది వేస్తారని వెల్లడించారు. వ్యవసాయ శాఖ రాష్ట్రవ్యాప్తంగా పంటలను పండుగలా చేసేందుకు కృషి చేస్తోందని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, "ములుగు జిల్లా ఎప్పటి నుంచో రైతులకు జీవనాధారమైన ప్రాంతం. నేను 40 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు" అని చెప్పారు. ఉగాది రోజున మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆయిల్ ఫార్మ్ ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు.

"ములుగు జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాం. కర్రిగుట్ట ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చుతాం. అలాగే తెలంగాణలోని అన్ని జిల్లాలలో ఆయిల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం" అని మంత్రి తుమ్మల అన్నారు.

# దేశ స్థాయిలో తెలంగాణ గౌరవం నిలబెట్టాలి

మొదటిపేజీ తరువాయి




ఎంపికైన 178 మంది అభ్యర్థులకు రూ.1 లక్ష ఆర్థిక సహాయం చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సివిల్స్ - 2024 విజేతలకు సన్మాన కార్యక్రమం కూడా జరిగింది.

ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐఏఎస్ అధికారుల సేవలు సమాజాభివృద్ధికి ఉపయోగపడాలని సూచించారు. తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు మెయిన్స్‌లో విజయం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహాయం అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. "నిబద్ధతతో పనిచేసే వ్యక్తులు చరిత్రలో నిలుస్తారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరతాయి. పేదల జీవితాల్లో మార్పులకు కారణమవుతేనే మన జీవితానికి సార్థకత ఉంటుంది. మీ ముందున్న ప్రతి సవాల్ సమాజాభివృద్ధి కోసం ఉండాలి" అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# కృష్ణా రివర్‌లో ఏపీ పెత్తనం.. బోర్డులో తెలంగాణ అధికారులేరి?


మొదటిపేజీ తరువాయి

చొరవ చూపడం లేదు. బోర్డు విశాఖకు తరలుతుందన్న ఉద్దేశంతో రాష్ట్ర అధికారులు బోర్డులోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇదే అదునుగా ఏపీకి అనుకూలంగా బోర్డు పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. బోర్డులో ఖాళీ పోస్టులన్నింటినీ ఏపీ అధికారులతో నింపేందుకు సన్నద్ధమవుతున్నదని విశ్వసనీయ సమాచారం. విభజన చట్టం ప్రకారం తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీ, వివాదాల పరిష్కారానికి రివర్ బోర్డులు ఏర్పాటయ్యాయి. ఈ బోర్డుల్లో చైర్మన్, మెంబర్ సెక్రటరీ, ఇద్దరు మెంబర్లను కేంద్రం నియమిస్తుంది. మిగతా బోర్డు సెక్రటేరియట్‌లో ఇరు రాష్ట్రాల నుంచి ఎస్ఈలు, ఈఈలు, డీఈఈ, ఏఈఈలు సమాన నిష్పత్తిలో నియమించుకుంటారు.

కేఆర్ఎంబీలో 2 ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజినీర్), 4 ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్), 6 డీఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్), 10 ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) పోస్టులు మొత్తం 22 ఉన్నాయి. ఆ పోస్టులను ఇరు రాష్ట్రాలకు సంబంధించిన అధికారులతో సమాన నిష్పత్తిలో భర్తీ చేయాలి. ఇవి గాకుండా ఎలక్ట్రికల్ ఇంజినీర్, అకౌంట్స్ ఆఫీసర్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. అయితే ఏపీకి సంబంధించిన 50% పోస్టులన్నీ ఆ రాష్ట్ర అధికారులతో భర్తీ చేశారు. ప్రస్తుతం తెలంగాణకు సంబంధించి 50% కోటాలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక ఈఈ పోస్టు ఇప్పటికీ ఖాళీ ఉన్నది. వచ్చేనెలలో మరో ఈఈ పోస్టు ఖాళీ కానున్నది. 5 ఏఈఈ పోస్టుల్లో ఒక్క ఏఈఈ మాత్రమే ఉండగా, నాలుగు పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఉన్న ఆ ఒక్క ఏఈఈ పదవీకాలం వచ్చే నెలతో ముగియనున్నది. దీంతో ప్రస్తుతం బోర్డులో కీలక వ్యవహారాలన్నీ ఏపీ అధికారులే చక్కబెడుతున్నారు. బోర్డులో తెలంగాణ గొంతుకను, అభిప్రాయాలను బలంగా వినిపించే అనుభవజ్ఞులు లేకుండాపోయారు.

**ఏపీ అధికారులతో భర్తీకి కుయుక్తులు**

తెలంగాణ కోటాకు సంబంధించిన పోస్టుల భర్తీకి ఆసక్తి ఉన్న ఉద్యోగుల నుంచి తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ ఇప్పటికే గత మార్చి నుంచి దాదాపు 4 దఫాలుగా దరఖాస్తులను కోరింది. అయితే, కేఆర్ఎంబీలోకి డిప్యుటేషన్‌పై వెళ్లేందుకు రాష్ట్ర ఇరిగేషన్ ఉద్యోగులెవరూ ఆసక్తి చూపడం లేదు. కేఆర్ఎంబీని త్వరలోనే ఏపీకి తరలిస్తారనే ప్రచారం కొనసాగుతున్నది. ఒకవేళ అదే జరిగితే ఏపీకి వెళ్లి విధులు నిర్వర్తించాల్సి వస్తుందనే కారణంతో ఎవరూ ముందుకు రావడంలేదని తెలుస్తున్నది. బోర్డులో పనిచేసే అధికారులకు గతంలో బేసిక్ వేతనంపై 25శాతం ఇన్సెంటివ్ చెల్లించేవారు. ఇటీవల దాన్ని కూడా రద్దు చేశారు. దీంతో బోర్డులోకి వెళ్లేందుకు రాష్ట్ర అధికారులు ఆసక్తి చూపడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బోర్డులో ఉద్యోగుల భర్తీకి ఎలాంటి చొరవ చూపడం లేదు. సుదీర్ఘకాలంగా తెలంగాణ కోటా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఇప్పుడు పరిపాలన పరమైన సాకుతో ఆ పోస్టులను ఏపీ అధికారులతో భర్తీ చేయాలని బోర్డు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే ఏఈఈ పోస్టులన్నింట్లో ఏపీ అధికారులే తిష్ట వేయనున్నారు. అది బోర్డులో తెలంగాణకు చాలా ఇబ్బందికరమని రాష్ట్ర ఇంజినీర్లు చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని ఎన్నిసార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదని వివరిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణం స్పందించి, దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.




# సర్వహంగులతో 'రేవంత్ అతిథిగృహం'..

మొదటిపేజీ తరువాయి

భవనాలను పరిశీలించారు. నానక్‌రామ్‌గూడలోని గ్రోత్ కారిడార్ భవనం, బేగంపేటలోని మెట్రో భవన్, పైగా ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ సెంటర్ తదితర భవనాలు ఇందులో ఉన్నాయి.

అనంతరం చాలాసార్లు ఎంసీఆర్ హెచ్ఆర్డీలో కూడా సీఎం పలు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడే వీవీఐపీ అతిథిగృహం పేరుతో సరికొత్త భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. అది సీఎం నివాసానికి అతి దగ్గరలో ఉండటంతో దాన్ని క్యాంపు కార్యాలయంగా ఉపయోగిస్తారనే ప్రచారం కూడా జరిగింది. ఆ నిర్మాణం కోసం నిరుడు మార్చిలో ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసింది. రెండు అంతస్థుల్లో దాదాపు 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించాలని మొదట నిర్ణయించారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో చేపట్టిన ఈ భవన నిర్మాణం వ్యయం ఇప్పుడు మూడు రెట్లు పెరిగినట్టు సమాచారం. భవనాన్ని మరింత విస్తరించడంతోపాటు అందులో ఫైవ్‌స్టార్ హోటల్ తరహాలో సకల సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులో భాగంగా భవనంలో ఏర్పాటుచేయాల్సిన అత్యాధునిక ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు, పెరగనున్న వ్యయం, త్వరితగతిన పూర్తిచేయడం వంటి అంశాలపై నివేదిక సమర్పించేందుకు నిపుణుల కమిటీ కసరత్తు చేస్తున్నదని ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. భవన నిర్మాణ వ్యయం మూడు రెట్లకుపైగా పెరుగుతున్నట్టు సమాచారం.

**పేదల ఇండ్లకు మాత్రం అన్నీ సమస్యలే**

పేదలదందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరు చేసిన ఇండ్లను కూడా రద్దు చేసేందుకు కారణాలను వెతుకుతున్నదని ప్రజలు మండిపడుతున్నారు. సుమారు 450600 చదరపు అడుగుల వరకు నిర్మాణం చేసుకోవచ్చని మొదట ప్రకటించిన ప్రభుత్వం.. ఇంటి నిర్మాణం మొదలయ్యాక స్థలం తక్కువ ఉందని, ఎక్కువగా ఉందనే చిన్నచిన్న కారణాలతో ఇండ్లను రద్దుచేస్తున్నది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో చాలా మంది లబ్ధిదారులు.. తమ పాత ఇండ్లను కూలగొట్టుకొని కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో ఇల్లు ఉంటుందో.. రద్దు అవుతుందో అర్థం కావడంలేదని వారంతా లబోదిబోమంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 20వేల పైచిలుకు ఇండ్లు రద్దు కావడం వారి ఆందోళనకు కారణంగా చెప్పవచ్చు. అంతేకాదు, హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో స్థలాలు లేవనే కారణంతో జీ+3 పద్ధతిలో ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించినప్పటికీ, ఇంతవరకు ఎక్కడా స్థలాల గుర్తింపు కూడా పూర్తికాలేదు. నిధుల విషయానికొస్తే.. ప్రభుత్వం ప్రకటించిన 4.5లక్షల ఇండ్లకు రూ. 22,500 కోట్ల నిధులు అవసరం కాగా.. ఇప్పటివరకు ప్రభుత్వం లబ్దిదారులకు విడుదల చేసింది కేవలం రూ. 300 కోట్ల లోపే కావడం గమనార్హం. అలాగే ఇప్పటివరకు కేవలం 3 లక్షల ఇండ్లను నామమాత్రంగా మంజూరు చేసిన ప్రభుత్వం.. అందులో ఒక్క ఇంటి నిర్మాణాన్ని కూడా పూర్తిచేయలేదు. పేదలకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లను రద్దు చేసేందుకు ప్రభుత్వం సాకులు వెతుకుతున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీవీఐపీ అతిథిగృహం పేరుతో నిర్మిస్తున్న సీఎం క్యాంపు కార్యాలయాన్ని మాత్రం సర్వహంగులతో ఆగమేఘాలపై అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పనులు చేస్తుండడం అనుమానాలకు తావిస్తున్నదని పలువురు చెప్తున్నారు.

**గెస్ట్‌హౌజ్ అక్కడే ఎందుకో!**

**ప్రభుత్వ ఆధీనంలోని చాలా గెస్ట్‌హౌస్‌లు ఇప్పటికే నిరుపయోగంగా ఉన్నాయి. గ్రీన్‌ల్యాండ్, దిల్‌కుషా, ఇందిరాపార్క్ గెస్ట్‌హౌస్‌లతోపాటు పర్యాటకశాఖకు చెందిన తారామతి బారాదరి, హరిత ప్లాజా, శిల్పారామం తదితర భవనాలను గెస్ట్‌హౌస్‌లుగా ఉపయోగించుకునే వీలున్నది. అంతేకాదు, కొత్తగా నిర్మించిన సచివాలయంలో కూడా ముఖ్యమైన అతిథుల కోసం పైఅంతస్థుల్లో అత్యాధునిక హంగులతో గెస్ట్‌హౌస్‌లు నిర్మించారు. రాష్ట్ర విభజన తర్వాత పలువురు మంత్రుల బంగ్లాలను ప్రభుత్వ సలహాదారులకోసం కేటాయించారు. వీటిని కూడా గెస్ట్‌హౌస్‌లుగా ఉపయోగించుకునే వీలున్నది. ప్రస్తుతం ప్రజాభవన్‌గా ఉపయోగిస్తున్న భవనం కూడా నగరం నడిమధ్యన ఉండి, గెస్ట్‌హౌస్‌కు ఎంతగానో అనుకూలత కలిగి ఉంటుంది. ఇన్నిరకాల అవకాశాలున్నప్పటికీ ప్రత్యేకంగా ఎంసీఆర్ హెచ్ఆర్డీలో గెస్ట్‌హౌస్ నిర్మాణం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది సీఎం నివాసానికి అతి సమీపంలో ఉన్నది. అంతేకాకుండా పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల నివాసాలు అదే ప్రాంతంలో ఉండటంతో క్యాంపు కార్యాలయాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి భావించినట్టు సమాచారం. ప్రభుత్వం అవసరం లేకున్నా అతిథి గృహం పేరుతో సీఎం క్యాంపు కార్యాలయం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని రాజకీయవర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**



# విమర్శలను తిప్పికొట్టాలి

మొదటిపేజీ తరువాయి



మారిన ఎమ్మెల్యేలపై మూడునెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించిన నేపథ్యంలో స్పీకర్ పై ఒత్తిడిపెంచేలా కార్యచరణ చేపట్టాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే అందులో ప్రధానంగా ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేసేలా మాట్లాడాలని, అందుకు చట్టాలను సైతం అధ్యయనం చేయాలని, సమావేశంలో ప్రస్తావించాలని అన్నారు. స్పీకర్ చర్యలు తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకువెళ్లాలని సూచించారు. కాళేశ్వరం, బనకచర్ల అంశంపై గళం విప్పాలన్నారు. కాంగ్రెస్‌కు ప్రాజెక్టులపై అవగాహన లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యత తెలియదని మరోసారి వివరించాలని నేతలకు సూచించారు. కాళేశ్వరంపై సైతం న్యాయ పోరాటం చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. అదే విధంగా బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు అవసరం అయితే సుప్రీం కోర్టుకు వెళ్లాలని అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించినట్లు సమాచారం.

మరోవైపు ఈ మధ్యకాలంలో బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. ఎప్పటికీ విలీనం కాదని, తెలంగాణ రాష్ట్రం ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేకనే వీక్ చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని పార్టీ ఘనతను ప్రజలకు వివరించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికే బీఆర్ఎస్ ఏ పార్టీలో విలీనం కాదని క్లారిటీ ఇచ్చినప్పటికీ పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారని దీనిని ఎండగట్టాలన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్సీలపై సైతం సుప్రీంకోర్టుకు వెళ్లాలని, అర్హత పడేలా పక్కా ప్రణాళికలతో ముందుకెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 14న కరీంనగర్ లో జరిగే బీసీ బహిరంగసభకు ఏర్పాట్లు, జనం తరలింపు, కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లపై అనుసరిస్తున్న విధానం, ఆర్డినెన్స్ పేరుతో కాంగ్రెస్, బీజేపీ కుట్రలు చేస్తున్నారని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. సభ బాధ్యతలు విజయవంతంపై తీసుకోవాల్సిన చర్యలను మాజీ ఎంపీ వినోద్ కుమార్ కు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిందని, రెండుపర్యాయలు బీసీలకు ఇచ్చిన నామినేటెడ్, మంత్రి పదవులు, తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకోవాలని కేసీఆర్ సూచించారు. బీసీ రిజర్వేషన్లపై జరుగుతున్న జాప్యంపై అవసరం అయితే ప్రభుత్వంపై ఒత్తిడిపెంచేందుకు పోరాట బాట పట్టాలని సూచించారు. ప్రభుత్వ హామీలు వైఫల్యాలు, సంక్షేమ పథకాల అమలులో జాప్యంపై ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని నేతలను ఆదేశించారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్.. ఢిల్లీలో హైటెన్షన్

- ఈసీ కార్యాలయానికి కూటమి ఎంపీల ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు.. ఖర్గే, అఖిలేశ్ యాదవ్ సహా పలువురి అరెస్ట్
- ప్రత్యేక బస్సుల్లో పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు

హైదరాబాద్ ఆగస్టు 11 (ప్రజాస్వరం): పార్లమెంట్ భవనం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరిన కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సహా పలువురు కీలక నేతలను అరెస్టు చేశారు. ప్రత్యేక బస్సుల్లో వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ అరెస్టుల నేపథ్యంలో ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది. లోక్ సభ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ అవకతవకలపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెంచేందుకు ఈ రోజు విపక్ష కూటమి ఎంపీలంతా ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి మార్చ్ నిర్వహించేందుకు తలపెట్టగా అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు.

సంసద్ మార్గ్‌ను బ్లాక్ చేశారు. భేటీకి 30 మందికి అనుమతిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించగా.. అందరం కలిసే వెళతామని ఇండియా కూటమి ఎంపీలు పట్టుబట్టారు. పోలీసులు అడ్డుగా పెట్టిన బారికేడ్లు ఎక్కి అవతలకు దూకి రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ప్రజాపాలన అంటే ఇదేనా..?

- కలెక్టర్ ఎదుటే దారుణం
- దివ్యాంగుడిని ఈడ్చి వీల్‌చైర్ నుంచి పడేసిన కానిస్టేబుల్
- ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం.. "ప్రజాపాలన అంటే ఇదేనా?" ప్రశ్న
- బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్



హైదరాబాద్ ఆగస్టు 11 (ప్రజాస్వరం): జగిత్యాలలో జరిగిన దారుణ ఘటనపై తెలంగాణ ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో గోడు చెప్పుకోవడానికి వచ్చిన ఓ దివ్యాంగుడిని, కలెక్టర్ ఎదుటే కానిస్టేబుల్ ఈడ్చి, అతని వీల్‌చైర్ నుంచి కింద పడేసి లాక్కెళ్లిన ఘటనపై ఆమె స్పందించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఎమ్మెల్సీ కవిత ఈ సంఘటనను "ప్రజాపాలన అంటే ఇదేనా?" అని ప్రశ్నిస్తూ, దీనిని అత్యంత దుర్మార్గమైన చర్యగా ఖండించారు. బాధ్యుడైన కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాక, తన కళ్ల ముందే ఇంతటి ఘటన జరిగి కూడా స్పందించని జగిత్యాల కలెక్టర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

## వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, ఆగస్టు 11(ప్రజా స్వరం) :**

ప్రజా ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికివచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 84 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ భూ సమస్య లు,ఇందిరమ్మ ఇల్లు ,ఎలక్ట్రిసిటీ , గ్రామ పంచాయతి , విద్యా శాఖ, ఆసరా పెన్షన్ లకు సంబందించి ఫిర్యాదు లు సమర్పించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదు దారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. సి ఎం ఓ ప్రజావాణి కి జిల్లా పై వచ్చిన ప్రజా ఫిర్యాదు లను చెక్ చేసి దరఖాస్తు ఎ ప్రాసెస్ లో ఉందో చెక్ చేసి ఆన్లైన్ అప్డేట్ చేయాలనీ ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అందరు సమయ పాలన పాటిస్తూ అటెండన్స్ తప్పనిసరిగా ఉండాలని, మిగతా అందరు అధికారులు కూడా అటెండన్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు సమన్వయ ముతో ఘనంగా ఏర్పాట్లు చేయాలనీ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి , ఆర్ డి ఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎ ఓ, సెక్షన్ సూపరింటెండెంట్స్ పాల్గొన్నారు.

# వైద్యుల పర్యవేక్షణలోనే ఆల్బెండజోల్ వేసుకోవాలి

## వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**వికారాబాద్, ఆగస్టు 11(ప్రజా స్వరం):**

ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు వారందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణ పరిధి లోని కొత్త గడి రెసిడెన్షియల్ స్కూల్ లో జిల్లా ఆరోగ్య వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వేసుకోవాలని ,జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డి వార్మింగ్ డే) ను పురస్కరించుకొని పట్టణం లోని కొత్త గడి రెసిడెన్షియల్ పాఠశాల ,కళాశాల లో చేపట్టిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమం లో కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ (నేషనల్ డి వార్మింగ్ డే) కార్యక్రమానికి చాల ప్రాదాన్యాత ఉందని, నులిపురుగుల కారణంగా పిల్లల ఎదుగుదలలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయన్నారు. నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 11వ తేదీన (నేషనల్ డి వార్మింగ్ డే) ను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒక సంవత్సరం వయసు నుండి 19 సం . వయస్సు వారందరికీ నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. వైద్యులు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ,ప్రైవేటు విద్యాసంస్థలు అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో ఒకటి నుండి 2 సంవత్సరాల లోపు పిల్లలకు సగం మాత్రను చూర్ణం చేసి నీటిలో గాని పాలలో గాని కలిపి మాత్రలు వేసుకునేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు మూడు సంవత్సరాల వారికి ఒక మాత్ర చూర్ణం చేసి నీటిలో కలిపి ఇచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు . ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలందరూ వైద్యుల పర్యవేక్షణలోనే మాత్రలు వేయనునట్లు తెలిపారు . నులిపురుల వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తాయని వాటి నివారణ కోసం తప్పనిసరిగా ఈ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. నులిపురుగుల సమస్య కారణంగా ఆహారం ఎంత తీసుకున్నప్పటికీ బరువు పెరగకపోవడం, బలంగా లేకపోవడం లాంటి సమస్యలు వస్తాయని, ,ఈ సమస్యల నివారణ కు పరిశుభ్రత చర్యలు పాటించడం, సరైన పౌష్టికాహారం తీసుకోవడం, అన్నం తినే ముందు కాళ్లు చేతులు, శుభ్రంగా కడుక్కోవడం లాంటివి చర్యలు చేపట్టాలన్నారు. నులిపురుగుల నివారణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులి పురుగులను నివారించవచ్చు అన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వైద్యులు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే వేసుకోవాలని, ఇంటికి తీసుకెళ్తాం అని అనకుండా వైద్యుల పర్యవేక్షణలో వేసుకోవడం మంచిదన్నారు. ఈరోజు తప్పిపోయిన పిల్లలకు రేపటినుండి 19వ తేదీ వరకు అంగన్వాడి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది వైద్య ఆరోగ్య సిబ్బంది ఇచ్చే మాత్రలను ప్రతి ఒక్కరు వేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం లో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ గారి చేతుల మీదుగా కొంతమంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సవంత్సరం పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వంట గదిని పరిశీలించి బియ్యము నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రాకారమ భోజనం ఉండాలని, పరిశుభ్రత పాటించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారిణి లలితా దేవి, శిశు సంక్షేమ అధికారిని కృష్ణవేణి, డాక్టర్ పవిత్ర, రెసిడెన్షియల్ వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ప్రోగ్రాం అధికారులు , ఉపాధ్యాయులు ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .

# జాప్యం లేకుండా అర్జీలను పరిష్కరించాలి

## కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి




**శామీర్ పేట ఆగస్టు 11(ప్రజ స్వరం) :**

ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టరు (71)దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంటవెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు





**శామీర్ పేట ఆగస్టు 11(ప్రజా స్వరం):**

రాఘవేంద్ర స్వామి ఆరాధ నోత్సవాలు వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. సోమవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని గాయత్రి మ హాక్షేత్రంలో రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ, శిశ్యజనోద్ధారక, రాఘవేంద్ర స్వామి ఉపాసకులు డాక్టర్ ఎస్ఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆరాధన ఉత్సవాలలో ఈరోజు ముఖ్యమైన రోజు అని తెలిపారు. స్వామి వారు బృందావనం నుంచి బయటకు వచ్చి భక్తులకు ఆశీస్సులు అందించిన రోజని చెప్పారు. వేద బ్రహ్మణుల మంత్రోచ్ఛరణలమధ్య ప్రధానార్చకులు రాఘవేంద్ర పండితుడు స్వామివారికి ఉదయం నుంచి మలరాధన నిర్మాల్య విసర్జన, ఫలపంచామృత అభిషేకం, పాదపూజ, కనకాభిషేకము, తులసి అర్చన, హస్తోదకం, తీర్థప్రసాద వితరణ, భోజన కార్యక్రమం, సాయంత్రం పల్లకి సేవా, రథో త్సవం, అష్టావధాన సేవా, మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల భక్తులతో పాటు నగరానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వేస్ట్ డీకంపోజర్ వల్ల అధిక లాభాలు

## రైతు రత్నగారి రాజేశ్వర్ రెడ్డి



**నిజాంపేట, (ప్రజా సర్వం) :**

వేస్ట్ డికంపోజర్ వాడడం వల్ల భూమికి అనేక లాభాలు పొందవచ్చని నిజాంపేట మండలం కల్వకుంట గ్రామానికి చెందిన రైతు రత్న గారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కేంద్రంలో వేస్టికంపోజర్ వాడడం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలు ఒక జీవన ద్రావణం బయో సొల్యూషన్ దీనివలన పొలంలో సేంద్రియ పదార్థాలు పెరిగి నేల సారవంతంగా మారుతుందన్నారు.దీనిని వాడడం వల్ల ఖర్చులు తగ్గింపు రసాయన ఎరువులు పురుగు మందుల ఖర్చు గణనీయంగా తగ్గుతుందని.చిన్న బాటిల్ వేస్ట్ డీకంపోజర్ తో పెద్ద మొత్తంలో తయారు చేసుకోవచ్చు నేలలో సూక్మజీవుల సంఖ్యను పెంచుతూ భూమిని మరింత ఆరోగ్యంగా ఉంచుతుంది తయారైన సేంద్రియ ఎరువులు నేలలో నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంటూ పోషకాలు లభ్యత భాస్వరం పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి.వ్యవసాయానికి ఒక చక్కని పరిష్కారమని పర్యావరణానికి హాని కలగకుండా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు.

# కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలి



**శామీర్ పేట ఆగస్టు 11(ప్రజా స్వరం) :**

ఎల్లంపేట, ముడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ కార్మికుల రెండు నెలల జీతాలు ఇంకా చెల్లించలేదని సీఐటియు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ అన్నారు. అలాగే విలీనమైన గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలు బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన మున్సిపలిటీలలో పనిచేస్తున్న కార్మికులకు రెండు నెలల జీతాలు ఇప్పటికీ రాలేదని తెలిపారు. విలీనమైన గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల వేతనాలు బకాయిగా ఉన్నాయి. మొత్తం ఐదు నెలల జీతాలు ఇవ్వకుండానే వారు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ధర్నా సమయంలో ప్రజావాణి వద్ద అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తాను కలుసుకుని ఈ వారంలో మున్సిపల్ జీతాలు చెల్లిస్తామని, గ్రామపంచాయతీ వేతనాలు కూడా త్వరలో అందజేస్తామని హామీ పొందారు. సీఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల జీతాలు చెల్లించకపోవడం సరికాదన్నారు.

# ఆల్బెండోజల్ ట్యాబ్లెట్ల పంపిణీ



## డాక్టర్ సాయి కృష్ణ

**నిజాంపేట. 11.( ప్రజా సర్వం ) :**

మెదక్ జిల్లా నిజాం పేట మండల కేంద్రంలో సోమవారం నూలి పురుగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు ఆల్బండోజల్ ట్యాబ్లెట్ అందించామని డాక్టర్ సాయి కృష్ణ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 11 నూలి పురుగు దినోత్సవం రోజు 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు ఆల్బండోజల్ ట్యాబ్లెట్ ను అందించామని.ఈ ట్యాబ్లెట్ ద్వారా ఏలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా రక్తం వృద్ధి చెందుతూ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి యాదగిరి, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మహేందర్,ఉపాధ్యాయులు శ్రీనివాస్ చారి, రమేష్, దేవయ్య, వెంకటస్వామి, ఆశ వర్కర్లు అనిత, బాలమణి పాల్గొన్నారు.

# రైతు భీమా దరఖాస్తుల స్వీకరణ

**నిజాంపేట, ( ప్రజా సర్వం ) :**

మెదక్ జిల్లానిజాంపేటమండల కేంద్రంలోని రైతు వేదిక లో అర్హులైన రైతుల నుండి పోర్టల్ లో నమోదు కార్యక్రమం చేపట్టామని వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం జూన్ 5 లోపు వచ్చిన పట్టా పుస్తకాలు కలిగిన రైతులందరూ రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. రైతు అకాల మరణం సంభించినప్పుడు నామిని బ్యాంకు ఖాతా లో 5 లక్షల రూపాయలు జమచేయబడును. రైతు భరోసా దరఖాస్తు చివరి తేదీ ఆగస్టు 13 కావున రైతులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# రెపరెపలాడిన మువ్వ నెల జెండా



**రామాయంపేట, (ప్రజా సర్వం) :**

భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటి చెప్పే విధంగా భారతీయులంతా తిరంగా యాత్ర లో పాల్గొనాలని బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో సోమవారం బిజెపి పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానం నుండి ప్రారంభమైన ర్యాలీ 300 మీటర్ల మూడు రంగుల జెండా పట్టుకున్న విద్యార్థిని విద్యార్థులు జాతీయ గీతాలు ఆలపిస్తూ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మూడు రంగుల జెండా ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. తిరంగా యాత్రలో కుల, మత, ప్రాంతాల కతీతంగా అన్ని వర్గాల వారు ర్యాలీలో పాల్గొనాలని, భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూరం ద్వారా భారత ప్రధాని నరేంద్ర మోడీ భారతీయుల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, మండల పార్టీ అధ్యక్షులు నవీన్ గౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న మైన శ్రీనివాస్, ఎమ్మెల్యేన్ రెడ్డి, ఓబిసి మోస రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల శేఖర్, రామయంపేట ఇన్చార్జ్ వెలుముల సిద్ధరాములు, రామాయంపేట పట్టణ కార్యదర్శి మన్నే ప్రవీణ్ రాజు, పట్టణ ఉపాధ్యక్షులు మంగలి భరత్, సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, దుర్వెనపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు

**శామీర్ పేట, ఆగస్టు 4 (ప్రజా స్వరం) :**

శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో శివ కేశవులను ఎంతో నిష్టతో ఆరాధిస్తారు. ఇందులో భాగంగా శ్రావణ సోమవారం పురస్కరించుకొని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం హారతి, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం

### ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ : డాక్టర్ హరిప్రియ



**రామాయంపేట, (ప్రజా సర్వం ) :**

విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ హరి ప్రియ సూచించారు. రామాయంపేట మండలం కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో సోమవారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 14 వేల మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 18 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. నులి పురుగు నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల సిబ్బందితోపాటు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



## రూ.2 వేల కోట్లతో నాలుగు లైన్ల రహదారి

### అప్ప జంక్షన్–మన్నెగూడ నేషనల్ హైవే పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**వికారాబాద్, ఆగస్టు 11(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా పరిధి లోని మన్నెగూడఅప్ప జంక్షన్ నేషనల్ హైవే పనులను, అలాగే మొయినాబాద్ వద్ద జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను పరిగి ఎమ్మెల్యే ,డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... రూ.1050 కోట్లతో అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నిర్మించబోయే నేషనల్ హైవే పనులకు అన్ని అడ్డంకులు తొలగాయని చెప్పారు.రోడ్డు ఇరువైపులా ఉన్న మర్రి చెట్ల విషయంలో గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసిన పర్యావరణ వేత్తలు,కేసును ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా మన్నెగూడ నుంచి కొడంగల్ నియోజకవర్గంలోని కర్ణాటక సరిహద్దు వరకు రూ. వేయి కోట్లతో నాలుగు లైన్ల రహదారి మంజూరైందని తెలిపారు. అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ మీదుగా కొడంగల్ నియోజకవర్గంలోని కర్ణాటక సరిహద్దు వరకు మొత్తం రూ.2 వేల కోట్లతో నాలుగు లైన్ల రహదారి మంజూరైందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు.ఈ రహదారి పూర్తి స్థాయిలో పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు,ప్రాంతీయ అభివృద్ధికి ఊతమివ్వనుందని ఆయన అన్నారు.నిర్మాణంలో ఉన్న రహదారి పనులు వేగవంతంగా పూర్తిచేయడంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడి

**నిజాంపేట, (ప్రజా సర్వం ) :**

మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట,రజాక్ పల్లి గ్రామ శివారులో గల పౌల్ట్రీ ఫామ్ లో కొందరు మూడుముక్కల పేకాట ఆడుతున్నారని విశ్వనీయ సమాచారంతో అధికారుల అనుమతి పొంది సోమవారం టాస్క్ ఫోర్స్ అధికారులు ఎస్ఐ రాజేష్,తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు మంది వ్యక్తులను అదుపులో తీసుకోవడం జరిగింది. వారిని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి వారి వద్ద 1,73,720/ నగదు 6సెల్ ఫోన్లు,స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితుల వివరాలు మెంచు శ్రీకాంత్, చిట్యాల రాజు, గోపరి పెంటయ్య, జీడిపల్లి నాగరాజు గౌడ్, చంద్రం,రాజేశంలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా జూదం ఆడిన, ఆడడానికి అనుమతించిన క్రిమినల్ కేసులు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

## ఎంపీ రఘునందన్ కు హై సెక్యూరిటీ ఇవ్వాలి

### బెదిరింపులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్



**మెదక్, (ప్రజా స్వరం) :**

మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పై బెదిరింపు పాల్పడుతున్నరని వారికి హై సెక్యూరిటీ ఇచ్చి కాల్స్ పైన ఎంక్వైరీ చేయాలని సోమవారం మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల నుండి ఛత్తీస్‌ఘడ్ నుండి 5 సార్లు నక్సలైట్లు అని చెప్పి రావడం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు ఏకంగా హైదరాబాద్ నుండి బెదిరింపు కాల్ రావడం జరిగిందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీ గ్రామ గ్రామాలను వారు తిరగాల్సిన అవసరం ఉందనీ, ఇందుకు వారికి హై సెక్యూరిటీ ఇచ్చి, ఏవైతే ఫోన్ కాల్స్ వస్తున్నాయో వాటిని ఎంక్వైరీ చేయించి దోషులను గుర్తించి శిక్షించాలని ఎస్పీ నీ కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌ఎల్ఎన్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, బిజెపి నాయకులు శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయి పాల్గొన్నారు.

## కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



**వికారాబాద్, ఆగస్టు 11((ప్రజా స్వరం) :**

వికారాబాద్ జిల్లా పరిగి-లక్నాపూర్ రహదారి విస్తరణలో భాగంగా కల్వర్టుల నిర్మాణ పనులకు పరిగి ఎమ్మెల్యే, డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.... గతంలో మంత్రులు సీతక్క,తుమ్మల నాగేశ్వరరావు పరిగికి తీసుకువచ్చి ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయించినట్లు తెలిపారు.పరిగి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నానని,ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం అందించేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. పరిగి-లక్నాపూర్ రోడ్డు నిర్మాణం పూర్తయితే దాదాపు 15 నుంచి 20 గ్రామాల ప్రజలకు మేలు కలుగుతుందని,ముఖ్యంగా రోడ్డు మార్గంలోని సంక్షేమ హాస్టళ్లు,కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల ప్రయాణ సమస్యలు తొలగిపోతాయని చెప్పారు. ఇదే మార్గంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించబడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు ఇటీవలే మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినట్లు పేర్కొన్నారు.

## మెట్రో ఆటోమేటెడ్ పార్కింగ్ రెడీ..

**హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజా స్వరం) :**

హైదరాబాద్ మెట్రోరైల్ నిర్మించిన ప్రతిష్టాత్మకమైన ఆటోమేటెడ్ బహుళ అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్ ప్రారంభానికి సిద్ధమైంది. దేశంలోనే ఈ తరహా పార్కింగ్ ప్రాజెక్ట్ తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్మాణం కావడం విశేషం. త్వరలో ఈ పార్కింగ్ కాంప్లెక్స్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటోందని, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతి లభించిన వెంటనే అందుబాటులోకి తేనున్నట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన నాంపల్లిలోని మెట్రో పార్కింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. నగరంలో పార్కింగ్ కష్టాలను తీర్చే ఒక అద్భుతమైన ప్రాజెక్టుకుగా ఇది వినియోగంలోకి రానుంది. ప్రపంచంలోనే ఇలాంటి పూర్తిస్థాయి ఆటోమేటెడ్ పార్కింగ్ కాంప్లెక్స్‌లు ఎంతో అరుదుగా ఉన్నట్లు ఎన్వీఎస్ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఈ ప్రాజెక్టును అత్యంత ఆకర్షణీయంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా ఈ ప్రాజెక్టును నిర్మించామన్నారు.

**పార్కింగ్ ప్రత్యేకతలివీ..**

హైదరాబాద్ మెట్రోరైల్ ఈ ప్రాజెక్టును పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో చేపట్టింది. 'నోవమ్' అనే సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మించింది. ఇది జర్మనీకి చెందిన అత్యాధునిక 'పాలిస' సాంకేతికతతో పూర్తి ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ సిస్టమ్‌గా నిర్మితమైంది. ఈ ప్రాజెక్టు కోసం హెచ్ఎంఆర్ఎల్ 2000 చ.గ స్థలాన్ని 50 సంవత్సరాల కన్సెషన్‌కు ఇచ్చింది. ఈ ప్రాజెక్టు డెవలపర్లు డాక్టర్ హరికిషన్ రెడ్డి, భావనారెడ్డిలు రూ.102 కోట్లతో నిర్మించారని ఎన్వీఎస్ తెలిపారు.



ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 15 అంతస్తులు ఉంటాయి. ఇందులో 3 బేస్‌మెంట్లు, 7 పైఅంతస్తులు కలిపి మొత్తం 10 అంతస్థుల్లో పార్కింగ్ సదుపాయం ఉంటుంది. మరో 5 అంతస్తులను వాణిజ్య కార్యకలాపాలకు కేటాయించారు. ఈ పార్కింగ్ కాంప్లెక్స్‌లో అన్నిరకాల సదుపాయాలు కలిగిన రెండు సినీ థియేటర్లను కూడా ఏర్పాటు చేశారు. 11వ అంతస్తులో నగర వీక్షణ కోసం గ్యాలరీని ఏర్పాటు చేశారు. మొత్తం 10 పార్కింగ్ అంతస్తుల్లో 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయవచ్చని, ఈ ప్రాజెక్టు ద్వారా నగర ప్రజలకు ప్రపంచ స్థాయి పార్కింగ్ అనుభవం అందించనున్నామని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

## పోలీసుల ముమ్మర తనిఖీలు

**మెదక్, ఆగస్టు 11 (ప్రజా స్వరం) :**



ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల ముందస్తు తనిఖీలో భాగంగా భద్రత చర్యల నిమిత్తం మెదక్ పట్టణంలో బాంబు స్కాడ్ & నార్కోటిక్ డ్రగ్ స్కాడ్ లతో న్యుబస్టాండ్, ఓల్డ్ బస్టాండ్, రైల్వే స్టేషన్ లో మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ ఎస్. రంగనాథ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, మెదక్ పట్టణ సీఐ డి. మహేష్ ఆధ్వర్యంలో ముమ్మారంగా తనీఖీలు నిర్వహించారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా తనీఖీలు నిర్వహించబడును.

## వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం

**వికారాబాద్, ఆగస్టు 11(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లాలో సోమ వారం భారీ వర్షం కురవడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడ్డారు. జిల్లా లోని పలు వాగులు, వంకలు వరద నీటితో పొంగిపోర్లాయి. జిల్లా లోని కాగ్నావాగు, మూసీ వాగు, కోటపల్లి తదితర వాగులు భారీ వర్షాల వల్ల ఉదృతంగా ప్రవహించాయి. తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ బషీరాబాద్ రోడ్డు మార్గంలో అగ్గనూర్ వాడుక ఉప్పొంగడం తో కొన్ని గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లా లోని వికారాబాద్, తాండూరు,కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో సోమ వారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురవడంతో పంట పొలాలు వరద నీటితో నిండుకున్నాయి. ఖరీఫ్ సీజన్ కు సాగులో ఉన్న కంది, పత్తి ,మొక్కజొన్న తదితర పంట పొలాలు నీట మునిగిపోయాయి. కొన్నిచోట్ల పొలాలు నీట మునిగిపోవడంతో పైరులు కోతకు గురైనాయి. తాండూరు పట్టణం లోని గ్రీన్ సిటి, మార్కండేయ కాలని, మానిక్ నగర్ తదితర కాలనీలు వరద నీటి వల్ల చెరువులను తలపించాయి. తాండూరు పట్టణం లోని ఇందిరా నగర్ కాలనీలో మన్సూర్ఖాన్ ఇల్లు కూలీ పోయింది. నాపరాతి పై కప్పు కూలి పోయింది. జిల్లా లోని కోటపల్లీ ప్రాజెక్టు భారీగా వరద నీరు చేరింది. కాగా వర్షాల కారణంగా జిల్లాలో పలు లింక్ రోడ్లు దెబ్బతిన్నాయి.



## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

### ఎంసీపల్లి మండల వ్యవసాయాధికారి రవికుమార్

**శామీర్ పేట ఆగస్టు 11(ప్రజాస్వరం) :**



మూడుచింతలపల్లి మండలంలో ఈ సంవత్సరం జూన్ 5లోపు కొత్త పట్టాదారు పాస్ పుస్తకం వచ్చి 18 నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు కలిగి రైతుబీమా దరఖాస్తు చేసుకోని రైతులు ఈ నెల 11, 12 తేదిలలో మూడుచింతలపల్లి రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలని ఎంసీపల్లి మండల వ్యవసాయ అధికారి రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు జతపరిచి రైతు స్వయంగా వచ్చి సంతకం చేసి వ్యవసాయ అధికారికి తమ దరఖాస్తు ఇవ్వాలని తెలిపారు. బీమా చేసుకున్న రైతు ఏదైనా కారణాలతో మరణిస్తే ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుందని, కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. అయితే ఇంతకుముందు బీమా దరఖాస్తు చేసుకున్న రైతులకు అవసరం లేదన్నారు. ఇది వరకు బీమా ఉన్న రైతులు ఏమైనా మార్పులు చేయించుకోవాలంటే రైతువేదికకు వచ్చి మార్పులు చేయించుకోవచ్చని తెలిపారు.

# 16 సీసీ కెమెరాలు ప్రారంభం

- **పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**
- **నేరాలను నియంత్రించడంలో నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల కీలక పాత్ర వహిస్తాయి**

**కుకునూరు, ప్రజాస్వరం**




సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు,నేరరహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. ప్రజలకు భద్రత, సెన్సాఫ్ ఆఫ్ సెక్యూరిటీ కలిగించడంలో సీసీ కెమెరాలు చాలా ముఖ్యం.నేరాలను నియంత్రించడంలో మరియు నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయిసీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వ్యాపారస్తులను వివిధ సంఘాల నాయకులను ప్రజా ప్రతినిధులను అభినందించారు.

పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మార్వాడి సంఘం, మేస్త్రి సంఘం, రజక సంఘం చికెన్ సెంటర్ అసోసియేషన్ క్లాత్ అసోసియేషన్, మెడికల్ అసోసియేషన్, టింబర్ డిపో అసోసియేషన్, ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్, అధ్యక్షులను కార్యవర్గ సభ్యులను మాజీ సర్పంచ్ నరేందర్ లను అభినందించి సన్మానించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో రాజీవ్ రహదారి ఎంట్రీ, ఎగ్జిట్, ముఖ్యమైన చౌరస్తాలలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేరాలను నియంత్రించడంలో నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల కీలక పాత్ర వహిస్తాయి, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు, నేరరహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం, ప్రజలకు భద్రత, సెన్సాఫ్ ఆఫ్ సెక్యూరిటీ కలిగించడంలో సీసీ కెమెరాలు చాలా ముఖ్యం,నేరాలను నియంత్రించడంలో మరియు నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయి, సీసీ కెమెరాలు 24 గంటల నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. జిల్లాలో నేరాల అదుపు చేయడానికి పోలీసులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. నేరస్తుడు నేరం చెయ్యలేను అని చెప్పినా సీసీ కెమెరాలు చూపించినచో తను చేసిన నేరాన్ని ఒప్పుకోవడం జరుగుతుందన్నారు.

సీసీ కెమెరాలు ఉన్న ఇండ్లలో కాలనీలలో గ్రామాలలో నేరస్తులు నేరం చేయడానికి భయపడతారని తెలిపారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అందుకు గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలో సీసీ కెమెరాలు ఉండి పనిచేయని సిసి కెమెరాలు విషయంలో మరియు నూతన సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. ప్రజలు కూడా ఇంటి ఆవరణలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో పట్టణాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జియోట్యాగింగ్ ద్వారా సిద్దిపేట కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేసే తర్వాత హైదరాబాద్ కమాండ్ కంట్రోల్స్ సెంటర్ కు అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా షాపుల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఒక కెమెరా రోడ్డు వైపు పెట్టుకోవాలని సూచించారు. వ్యాపారస్తులు ఎన్నో లక్షల డబ్బులు ఖర్చు పెట్టి షాపులు పెడతారు 20 నుండి 30 వేల రూపాయలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ఏదైనా జరగరాని సంఘటన జరిగినా దొంగతనం జరిగిన నేరస్తులను పట్టుకోవడం సులభతరం అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నరసింహులు, తొగుట సిఐ లతీఫ్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, మరియు వివిధ సంఘాల అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు కొండపాక మండలం మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక్ష శ్రీనివాస్ రెడ్డి, ప్రజలు ప్రజా ప్రతినిధులు మహిళలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# డీ ఏ ఓ రైతుల సంక్షేమానికి కృషి చేశారు

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్వరం**

జిల్లా వ్యవసాయ అధికారి వీరు నాయక్ మరణం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వీరు నాయక్ సంతాప సభ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఅనారోగ్యానికి గురైన వీరునాయక్ నెల రోజులనుండి హైదరాబాద్ లోని ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారని తెలిపారు.వీరు నాయక్ నిజాయితీ గల అధికారి అని, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన మంచి అధికారిని కోల్పోయామని అన్నారు. వీరునాయక్ సేవలు వ్యవసాయ రంగానికి ఎంతో మేలు కలిగించాయన్నారు. ఆయన మృతి వ్యవసాయ శాఖకు తీరని లోటని పేర్కొంటూ వీరు నాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తూ జిల్లా యంత్రాంగం తరపున వీరునాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ఇంఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వాహనాలు తనిఖీ చేపట్టిన శ్రీశైలం సీఐ

**శ్రీశైలం, ప్రజాస్వరం**

నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా, ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ ఆదేశాల మేరకు శ్రీశైలం నందు సీఐ ప్రసాదరావు గారి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్, సీట్ బెల్ట్ ధరించని, హెల్మెట్ లేనివారికి,ట్రిపుల్ రైడింగ్,నెంబర్ ప్లేట్ లేని వాహనాలు మొదలైన వాటిని తనిఖీ చేసి ఫైన్ వేశారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది

- **జడ్పీటీసీ ఉప ఎన్నికలపై జగన్ స్పందన**
- **పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు**
- **సీఎం చంద్రబాబుపై జగన్ తీవ్ర ఆరోపణలు,**
- **అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలను హైజాక్**
- **చేస్తున్నారని విమర్శ**
- **వైసీపీ నేతలపై టీడీపీ గ్యాంగులు దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నాయని ధ్వజం.**
- **బాధితులపైనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన**

**అమరావతి, ప్రజాస్వరం**



ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్య విరుద్ధంగా, అరాచకంగా వ్యవహరిస్తున్నారని, కుట్రలు, దాడులు, అబద్ధాలతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని, వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ఎన్నికలను హైజాక్ చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ గూండాలు, కొందరు అధికారులు, పోలీసులు కలిసి ఈ కుట్రను అమలు చేస్తున్నారని విమర్శించారు.చంద్రబాబు కుట్రపూరిత ప్రణాళికలను అమలు చేస్తున్నారని మండపడ్డారు. ఉపఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే పోలీసులు దౌర్జన్యాలు మొదలుపెట్టారు. గతంలో ఎలాంటి కేసులు లేని వారిపై కూడా బైండోవర్ కేసులు పెట్టి వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు అని ఆరోపించారు.ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న తమ పార్టీ నేతలే లక్ష్యంగా టీడీపీ గ్యాంగులు దాడులకు తెగబడుతున్నాయని జగన్ ఆరోపించారు. ఆగస్టు 6న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నేత వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగిందని, వారి కారును ధ్వంసం చేసి నిప్పంటించే ప్రయత్నం కూడా చేశారని తెలిపారు. ఈ దాడుల సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని విమర్శించారు. వైసీపీ తరపున పనిచేస్తే ఇలాంటి దాడులే ఎదురవుతాయని భయపెట్టడానికే ఈ దారుణాలకు పాల్పడ్డారని అన్నారు.దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా, బాధితులైన వేల్పుల రాముతో పాటు మరో 50 మందిపై ఆగస్టు 6న మధ్యాహ్నం 3:30 గంటలకు తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ ఆరోపించారు. ఆగస్టు 8న మా పార్టీ నేతను బెదిరించి, ప్రలోభపెట్టి ఫిర్యాదు తీసుకుని రాఘవరెడ్డి, గంగాధర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి వంటి వారికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అదే రోజున పులివెందులలో వైసీపీకి ఓట్లు వేసే సుమారు 4,000 మంది ఓటర్లను ఇబ్బంది పెట్టేందుకు, పోలింగ్ బూత్‌లను గ్రామాలకు 2 నుంచి 4 కిలోమీటర్ల దూరానికి మార్చారు. బూత్ కబ్జా, రిగ్గింగ్‌కు ఆస్కారం కల్పించారు, అని ఆయన విమర్శించారు. పోలింగ్ రోజున మీడియా కవరేజీని నియంత్రించి, తమ దాడులు, దౌర్జన్యాలు బయటకు రాకుండా చూడాలని టీడీపీ ప్లాన్ చేస్తోందని జగన్ అన్నారు. నిజం చెప్పాలంటే వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది. అయినా నాకు దేవుడిపై, ప్రజలపై నమ్మకం ఉంది. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది అని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# మధురా నగర్ లో కార్డన్ సెర్చ్

**చొప్పదండి,ప్రజాస్వరం**



పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా గంగాధర మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని మధురానగర్ ప్రాంతంలో సోమవారం విస్తృతంగా పోలీసులు కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ ఆపరేషన్‌లో పాత నేరస్థులు అద్దె ఇళ్లలో నివసిస్తున్నారా అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించబడ్డాయని పోలీస్ అధికారులు తెలిపారు.ఈ తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని 94 వాహనాలు స్వాధీనం చేయబడ్డాయి. వీటిలో:
91 మోటార్ సైకిళ్లు,1 ఆటో రిక్షాలు,1 కారు, 1 ట్రాక్టర్ దొరికాయని తెలిపారు.ఈ సందర్భంగా మధురా నగర్ చౌరస్తాలో స్థానిక ప్రజలకు సైబర్ నేరాలు మరియు వాటి నివారణ మార్గాలపై పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే, నేరం జరిగిన గంటలోపే 1930 నంబర్ కు ఫోన్ చేసి, దొంగిలించబడిన సొమ్మును ఫ్రీజ్ చేయించుకోవచ్చని తెలియజేశారు.మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా, అమ్మకం, వినియోగం చట్టపరంగా నేరమని స్పష్టం చేసి, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. షీ టీమ్ సీఐ శ్రీలత సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాలపై విద్యార్థినులకు చైతన్యం కల్పించారు.అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.కరీంనగర్ రూరల్ ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ ఎన్. వెంకటస్వామి మాట్లాడుతూ చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు .ఈ సందర్భంగా డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు ."సే నో టూ డ్రగ్స్" అనే పోస్టర్‌ను ఏసీపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ ఎన్ .వెంకటస్వామి , సీఐ ప్రదీప్‌కుమార్ చొప్పదండి, సీఐ శ్రీలత, సీఐ బి. కోటేశ్వరరావు, సీఐ బి. సధన్‌కుమార్, సీఐ కె. సంజీవ్, గంగాధర ఎస్ఐ బి. వంశీకృష్ణ, ఎస్ఐ జి. నరేంద్ర రెడ్డి, ఎస్ ఐ అంటి నార్కోటిక్ బ్యూరో వి.పుల్లయ్య, ఎస్ఐ కె. రాజు, ఎస్ఐ సాయికృష్ణ, ఎస్ఐ సయ్యద్ అన్వర్, ఎస్ఐ పి. లక్ష్మారెడ్డి, ఎస్ఐ టీ. నరేష్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 13న జరిగే విజ్ఞాన మేళను జయప్రదం చేయండి

**బేతంచర్ల , ప్రజాస్వరం:**

బేతంచర్ల పట్టణంలోని సరస్వతి విద్య పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 13న జరిగే ఉమ్మడి జిల్లాల విజ్ఞానమేలను జయప్రదం చేయాలని సరస్వతి విద్యా మందిర్ పాఠశాల యాజమాన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు హుస్సేన్ రెడ్డి,పుల్లారెడ్డి, లు అన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలమ్మ,అధ్యక్షతన విజ్ఞానమేల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న విజ్ఞానాన్ని సైన్స్ ను పెంపొందించేందుకే విజ్ఞాన మేళ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు అన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జశ్వంత్ రెడ్డి,వెంకటస్వామి, ఉపాధ్యాయులు శ్యామ్ బాబు,రామదాసు,దివ్య, శ్రీదేవి,తదితరులు పాల్గొన్నారు.

# రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు

**నిజామాబాద్, ఆగస్టు 11, (ప్రజాస్వరం)**




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు ఆదేశించడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ముమ్మరం చేసింది. రెండు విడతల్లో సర్పంచ్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లకు ఒక విడత, బోధన్‌కు మరో విడత పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేశారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది.తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. స్థానిక సంస్థల పదవీకాలం పూర్తయ్యి దగ్గరదగ్గర ఏడాదిన్నర కావొస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎన్నికల నిర్వహించలేదు. ఈ అంశంపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో.. సెప్టెంబర్ 30 నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణ తప్పనిసరి అయ్యిందిఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసి రెడీగా ఉంది. నోటిఫికేషన్ రావడమే తరువాయి అంటున్నారు అధికారులు. అయితే త్వరలోనే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగున్నాయి. ఈ క్రమంలో సర్పంచి ఎన్నికలకు సంబంధించిన ఓ వార్త వినిపిస్తోంది. రెండు విడతల్లో సర్పంచి ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు రెడీ అవుతున్నారని తెలుస్తోంది. ఆ వివరాలు..రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికల గురించి కీలక ప్రకటన చేసింది. గతంలో అనగా 2019 సర్పంచ్ ఎన్నికలు రెవెన్యూ డివిజన్ల వారీగా మూడు విడతలుగా జరిగేవి. కానీ ఈసారి రెండు విడతల్లోనే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనికి తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2019లో పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరిగాయి. రాజకీయ పార్టీల గుర్తులు ఉండవు కాబట్టి ఫలితాలపై ప్రభావం ఉండదని అలా చేశారు. కానీ ఈసారి రెండు విడతల్లోనే పోలింగ్ పూర్తి కానుంది. ఈక్రమంలో నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ అనే మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. జిల్లా అధికారులు అంచనా ప్రకారం ఆర్మూర్, నిజామాబాద్ డివిజన్లకు ఒకసారి, బోధన్‌కు మరోసారి పోలింగ్ జరిగే అవకాశం ఉంది. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది అంటున్నారు. పంచాయతీ ఎన్నికలకు కావాల్సిన బ్యాలెట్ పెట్టెలు సిద్ధంగా ఉన్నాయని ఎన్నికల సంఘం అధికారులు తెలుపుతున్నారు.ఎన్నికల నిర్వహణ కోసం నిజామాబాద్ జిల్లాలో ఉన్న వాటితో పాటు కర్ణాటక నుంచి కూడా తెప్పించమని చెప్పుకొచ్చారు. సర్పంచ్ స్థానాలకు 2,531 జంబో పెట్టెలు, వార్డు సభ్యుల స్థానాలకు 1,380 చిన్న పెట్టెలు రెడీగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి భద్రంగా ఉంచామని అధికారులు తెలిపారు. మొత్తం 545 గ్రామ పంచాయతీల్లో 5,022 వార్డులు ఉన్నాయి. మొదటి దశ పోలింగ్ అయిపోయిన తర్వాత బ్యాలెట్ పెట్టెలను రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామాలకు తరలిస్తారు.బ్యాలెట్ పేపర్ల ముద్రణ కూడా పూర్తయిందని అధికారులు తెలిపారు. గులాబీ రంగువి (సర్పంచి) 9.21 లక్షలు,తెలుపు రంగువి (వార్డు సభ్యులు) 9.20 లక్షలు ముద్రించి ఎన్నికల విభాగం స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఎన్నికల సంఘం చెప్పిన విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.

# రామచంద్రరావు బండి మార్క్

**హైదరాబాద్, ఆగస్టు 11, ప్రజాస్వరం**



బండి సంజయ్ భారతీయ జనతా పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. పార్టీ వ్యవహారాలు జోరుగా సాగేవి. అప్పట్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తెలంగాణకు అనేక పర్యాయాలు వచ్చారు.. తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే అన్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. సంజయ్ కూడా పార్టీ కార్యకలాపాలను ఉధృతంగా సాగించేవారు. భారత రాష్ట్ర సమితి పరిపాలన కాలంలో బండి సంజయ్ రెండు పర్యాయాలు పోలీసుల చేతిలో అరెస్టు అయ్యారు. బండి సంజయ్ నాయకత్వంలోనే భారతీయ జనతా పార్టీ దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితికి తిరుగులేని పోటీ ఇచ్చింది. మునుగోడు ఉప ఎన్నికల్లోనూ రెండవ స్థానంలో నిలిచింది. హుజరాబాద్ ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించింది. ఒకరకంగా బండి సంజయ్ భారతీయ జనతా పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో జవసత్వాలు కల్పించారని చెప్పుకోవచ్చు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధినాయకత్వం ఒకసారి గా బండి సంజయ్ ని తప్పించింది. ఆయన స్థానంలో కిషన్ రెడ్డి నియమించింది. ఆయినప్పటికీ భారతీయ జనతా పార్టీ 2018 ఎన్నికల తో పోల్చుకుంటే 2023లో గణనీయమైన ఫలితాలను సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా 8 స్థానాలను సొంతం చేసుకుంది. అయితే బండి సంజయ్ కనుక తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడిగా ఉంటే పార్లమెంటు స్థానాలు మరిన్ని పెరిగేవని రాజకీయ విశ్లేషకులు అంటుంటారు. భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం ఎందువల్ల బండి సంజయ్ ని మార్చాల్సివచ్చిందో ఇప్పటికీ క్లారిటీ లేదు. బండి సంజయ్ కి కేంద్ర మంత్రి పదవి ఇచ్చినప్పటికీ.. ఇప్పటికీ కార్యకర్తల్లో సంజయ్ లేని లోటు కనిపిస్తూనే ఉంది.ఇటీవల రామచంద్రరావు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రానికి అధ్యక్షుడిగా నియమించింది. ఆయనకు అధ్యక్ష పదవిని ఇవ్వడాన్ని పార్టీలో కొంతమంది నాయకులు జీర్ణించుకోలేకపోయారు. నేరుగా తమ నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ బిజెపి కేంద్ర నాయకత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదు. అయితే ఇప్పుడు ఆపరేషన్ ఆకర్ష్ కు పార్టీ కేంద్ర నాయకత్వం తెరలేపినట్టు కనిపిస్తోంది. అందువల్లే భారత రాష్ట్రసమితికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కాషాయ కండువా కప్పుకుంటున్నారు. ఇప్పటికే అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరారు. ఇంకా కొంతమంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు లైన్లో ఉన్నారని రామచంద్రరావు అంటున్నారు. ఒకవేళ గనుక ఇదే స్థాయిలో చేరికలు గనుక కొనసాగితే బిజెపి 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి బలపడుతుందని కాషాయ పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు.. రామచంద్ర రావు బండి సంజయ్ మాదిరిగానే పార్టీలో దూకుడు పెంచడానికి ప్రయత్నిస్తున్నారని వారు చర్చించుకుంటున్నారు.. ఒకవేళ రామచంద్రరావు సంజయ్ మాదిరిగానే జోరు కొనసాగిస్తే మాత్రం బిజెపికి తిరుగు ఉండదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# రైతు బీమా రెన్యువల్ చివరి తేది ఆగస్టు 14

- **జిల్లా వ్యవసాయ అధికారి జాడిబాబు.**

**జయశంకర్ భూపాలపల్లి, ;ప్రజాస్వరం**



రైతు కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించడం ఎందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం రెన్యూవల్ ప్రక్రియ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతుంది 2018 ఆగస్టు 15 నుంచి అమల్లో అమల్లోకి వచ్చింది ఈ పథకంలో 18 నుండి 59 ఏళ్ల వయసుగల పట్టాదార్ పాస్ బుక్ కలిగిన సాగు రైతులు అర్హులు ప్రమాదం అనారోగ్యం లేదా ఇతర కారణాలవల్ల రైతులు మరణించిన పక్షంలో నామినికి ఎల్ఐసి ద్వారా ఐదు లక్షలు ఒకేసారి అందజేస్తారు ప్రీమియం మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వం భరిస్తుంది ప్రతి సంవత్సరం ఆగస్టు 15 నుంచి తదుపరి ఆగస్టు 14 వరకు భీమా చెల్లుబాటులో ఉండగా రెన్యువల్ లేదా కొత్తగా నమోదు కావాలనుకునే రైతులు సమీపంలోని ఏఈఓ లేదా రైతు వేదికలో గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులకు సూచించారు పాస్ బుక్ ఆధార్ మరియు నామిని వివరాలు తాజాగా ఉండాలని తెలిపారు మరణం సంభవించిన వెంటనే ఏ ఈ ఓ కు సమాచారం ఇచ్చి అవసరమైన పత్రాలు సమర్పించాలి . జూన్ 5.2025 వరకు పట్టా పాస్ బుక్ పొందిన రైతులు అర్హులని జిల్లా వ్యవసాయ అధికారి జాడి బాబు వెల్లడించారు



# ప్రతి కార్యకర్త ప్రజానాయకుడు కావాలి

- **బిజెపి శ్రేణులు కు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపు**

**చిత్తూరు, ప్రజాస్వరం**

ప్రతి బిజెపి కార్యకర్త ప్రజానాయకుడు గా ఎదగాలి అందుకు అనుగుణంగా ప్రణాళిక లు రచించు కోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపు ఇచ్చారు. చిత్తూరు జిల్లా సారథ్యం యాత్ర లో బాగంగా బిజెపి కార్యకర్తలు సమావేశం లో బిజెపి శ్రేణులు కు దిశానిర్దేశం చేశారు.బిజెపి కార్యకర్తలు కు భయం జంకు అవసరం లేదు ప్రజాక్షేత్రంలో బిజెపి బలపడాలని అందుకు అనుగుణంగా గ్రామ సర్పంచ్, ఎంపిటిసి,జెడ్పీటీసీ, మున్సిపల్ కార్పోరేషన్, కౌన్సిల్ ఎన్నికల లో పోటీ చేసేందుకు సమాయత్తం కావాలని మాధవ్ కార్యకర్తల లో జోష్ నింపే విధంగా ప్రసంగం కొనసాగించారు.బిజెపి కార్యాలయాలు ప్రజలు సమస్యలు పరిష్కారం చేసే వేదిక లు గా మార్చాలని సూచించారు.అదేవిధంగా ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయం లో నిర్వహించే స్పందన కార్యక్రమాలు లో ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి మన వంతు కృషి చేయాలి.మండల,గ్రామ స్థాయిలో సమస్యలు తెలుసుకుని వాటిని జిల్లా కలెక్టర్ కార్యాలయం లో స్పందన కార్యక్రమం లో సమస్యలు పరిష్కారం చేసే విధంగా స్థానిక నాయకత్వం కృషి చేయాలి.రాష్ట్రంలో అధికారంలో ఉన్న భాగస్వామ్యం ఉన్న పార్టీ గా ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తాను.అధికారంలో ఉన్నభాగస్వామ్య పార్టీ గా నామినేటెడ్ పోస్టులు తో పాటు సాగునీటి సంఘాల లో ప్రాతినిధ్యం వచ్చి న విషయాన్ని ఈ సందర్భంగా మాధవ్ గుర్తు చేశారు.ప్రసంగం తొలుత సర్ కట్టమంచి రామలింగారెడ్డి ని స్మరించుకుంటూ ఆయన కృషి పి వివరించారు.కట్టమంచిరామలింగారెడ్డి ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా ఆనాడు అయన చేసిన సేవలు మరువలేనివి అన్నారు.చిత్తూరు జిల్లా లో పాడి పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తాయన్నారు.అదేవిధంగా మామిడి రైతులు కు భరోసా ఇచ్చేందుకు పార్టీ పరంగా కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చారు.



# దొంగ అరెస్టు.. 77 గ్రాముల బంగారం స్వాధీనం

**సికింద్రాబాద్, ప్రజాస్వరం**

చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న ఘరానా దొంగను అరెస్ట్ చేసిన సికింద్రాబాద్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు నిందితుడి నుండి 7.70లక్షల విలువైన 77గ్రాముల బంగారం స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. జీడిమెట్ల లో నివాసం ఉంటూ హెటెరోలో ఉద్యోగం చేస్తున్న కాకినాడకు చెందిన కొరిప్రోలు లవరాజు (23) చేడు వ్యాసనాలు, జల్సాలు, బెట్టింగులకు అలవాటు పడి దొంగతనాలు ప్రవృత్తిగా మార్చుకున్నాడని జీఆర్పీ డీఎస్పీ జావేద్ తెలిపారు. అందులో భాగంగా రద్దీగా ఉన్న సింహపురి ఎక్స్ ప్రెస్, గౌతమి ఎక్స్ ప్రెస్ రైళ్లలో దొంగతనాలకు రెండు చైన్ స్నాచింగ్ లకు పాల్పడినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించి 77గ్రాముల బంగారం స్వాదినం చేసుకున్నట్లు వెల్లడించారు.

# సివిల్స్ కు సన్నద్ధమయ్యే వారికి సాయం చేస్తాం : భట్టి

**హైదరాబాద్,ప్రజాస్వరం**



రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా సాయం అందిస్తున్నామని తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. సివిల్స్ కు సన్నద్ధమయ్యే వారికి ఎంతో కొంత సాయం చేయాలని అన్నారు. ప్రజాభవన్ రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం ద్వారా చెక్కుల పంపిణీ చేశారు. సివిల్స్ 2025 మెయిన్స్ కు ఎంపికైన అభ్యర్థులకు రూ. లక్ష చెక్కుల పంపిణీ అందజేశారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్ 2024 విజేతల కు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి భట్టి విక్రమార్క, కోమటి రెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మీరు ముందుకు వెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందించడానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు. విజయవంతంగా రెండో సంవత్సరం ఈ పథకం అమలు చేస్తున్నామని, రూ. లక్ష చెక్కును అభ్యర్థులకు అందిస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# మంత్రి పదవి ముఖ్యం కాదు.. అవినీతి రహిత పాలన అందించాలి

- **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**హైదరాబాద్ ఆగస్టు 11, ప్రజాస్వరం**



మంత్రి పదవి ఇస్తామన్న హామీని అధిష్టానం అమలు చేయలేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మంత్రి పదవి హామీ వాస్తవమేనని తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెప్పారని అన్నారు. భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పందించారు.రాష్ట్ర ముఖ్యనేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్నారన్నవాస్తవాన్నిమీడియాద్వారా ప్రజలకు వివరించిన భట్టికి ధన్యవాదాలు తెలియజేశారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని, తెలంగాణసమాజఆకాంక్షలునెరవేర్చేలాపాలన ఉండాలనిఆశిస్తున్నానిఅన్నారు.ప్రజలకుఇచ్చిన హామీలను సర్కారు అమలు చేయాలని, అవినీతి రహిత పాలన అందించాలని కోరుతున్నానని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రీడా పాలన బిల్లు

- **జాతీయ క్రీడా పాలన బిల్లు – 2025 కి మద్దతు ప్రకటించిన ఎంపీ కేశినేని శివనాథ్**
- **లోక్ సభలో జాతీయ క్రీడా పాలన బిల్లుపై ప్రసంగించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**
- **విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రతినిధిగా, ఏసీఏ అధ్యక్షుడిగా, ఈ బిల్లుకు మద్దతిచ్చిన ఎంపీ కేశినేని శివనాథ్**

**ఢిల్లీ : ప్రజాస్వరం**




జాతీయ క్రీడా పాలన బిల్లు - 2025 , "ఖేలో భారత్" విధానం 2025 క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేయడం, క్రీడా స్టార్టప్‌లను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాలు, మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాల నుండి భాగస్వామ్యాన్ని పెంచేందుకు దోహదపడుతుంది. అలాగే భారత క్రీడల్లో పారదర్శకత, న్యాయం, ప్రతిభ ప్రధానంగా నిలిచే భవిష్యత్తును నిర్మించడానికి జాతీయ క్రీడల పాలన బిల్లు 2025 సమయోచితమైన చట్టం.. ఇది క్రీడలను ఇబ్బంది పెట్టిన పాత సమస్యలు , నిర్వహణలో లోపాలు, అంతర్గత అధికార పోరు వంటి అంశాలను పరిష్కరిస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ లోక్ సభలో జాతీయ క్రీడా పాలన బిల్లు - 2025 కి మద్దతుగా ప్రసంగించారు.
లోక్ సభలో సోమవారం జాతీయ క్రీడా పాలన బిల్లు - 2025 పై మద్దతూ తెలుపుతూ ఎంపీ కేశినేని శివనాథ్ జాతీయ క్రీడల పాలన బిల్లుపై (National Sports Governance Bill, 2025) సభలో మాట్లాడే అవకాశం దక్కడం గౌరవంగా భావిస్తున్నానని, విజయవాడ ప్రజల ప్రతినిధిగా, అలాగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఈ కీలకమైన బిల్లుకు మద్దతు తెలపడం ఎంతో గర్వంగా వుందన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, అలాగే కేంద్ర యువజన , క్రీడల వ్యవహారాల మంత్రి మాన్సుఖ్ మాండవియా కృషితో రూపొందిన జాతీయ క్రీడల పాలన బిల్లు2025 భారత దేశాన్ని క్రీడా దేశంగా మార్చే దిశగా ముందుకు తీసుకువెళ్తుందన్నారు .ఈ బిల్లులో ప్రధాన అంశం జాతీయ క్రీడల బోర్డు ఏర్పాటు. ఈ సంస్థకు క్రీడా సమాఖ్యలకు గుర్తింపు ఇవ్వడం, పర్యవేక్షించడం, అవసరమైతే గుర్తింపును రద్దు చేయడం లేదా నిలిపివేయడం వంటి అధికారాలు ఉన్నాయన్నారు. ప్రజా నిధుల దుర్వినియోగం తగ్గుతుందన్నారు.అలాగే, అన్ని క్రీడా సంస్థల్లో స్వేచ్ఛా, నిష్పక్షపాత ఎన్నికలు జరగడం కోసం జాతీయ క్రీడల ఎన్నికల ప్యానెల్ ఏర్పాటవుతుంది. ఈ సంస్థలు కఠినమైన ఆచార నియమావళి (Code of Ethics) పాటించాలి. దీని వల్ల అనవసర జోక్యం తగ్గి, అంతర్గత వ్యవస్థ మెరుగై, క్రీడా పరిపాలన ప్రతిష్ఠ కాపాడబడుతుంది.క్రీడాకారుల రక్షణ, సంక్షేమం పైనా బిల్లులో ప్రాధాన్యత కల్పించటం జరిగిందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం "సేఫ్ స్పోర్ట్స్ పాలసీ తో క్రీడాకారులు తమ ప్రదర్శనపై దృష్టి పెట్టడానికి అవకాశం వుంటుందని, వారి హక్కులు, గౌరవం కాపాడబడతాయన్నారుఈ బిల్లులో అత్యంత పురోగతిశీల అంశం జాతీయ క్రీడల ట్రైబ్యునల్ ఏర్పాటు. ఇది మాజీ సుప్రీం కోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో, క్రీడలకు సంబంధించిన వివాదాలను మాత్రమే పరిష్కరించే స్వతంత్ర సంస్థ. దీని ద్వారా వేగవంతమైన, తక్కువ ఖర్చుతో, నిపుణుల నిర్ణయం లభించి, సివిల్ కోర్టులపై భారాన్ని తగ్గిస్తుందన్నారు.
బీసీసీఐ ఇప్పటికే ఈ బిల్లులో పేర్కొన్న సిద్ధాంతాలను అనుసరిస్తున్న క్రీడా సంస్థల్లో ఒకటి. తాను ఈ సంస్థలో సభ్యుడిగా ఉండటం గర్వంగా భావిస్తున్నట్లు తెలిపారు . బీసీసీఐ స్వతంత్రంగా నడుస్తూ, ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా, స్వంత వనరులతో పని చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలికి తేవడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్మించిందని పేర్కొన్నారు.. ఈ తరహా స్వయం సమర్థ క్రీడా సమాఖ్యలను ఆర్టీఐ చట్టం పరిధి నుండి మినహాయించడం ప్రభుత్వ నిర్ణయం ప్రశంసనీయమని కొనియాడారు.
రాష్ట్ర ప్రభుత్వాలతో భాగస్వామ్యంలో రాష్ట్ర క్రీడా పాఠశాలలు స్థాపించాలని,. దీని ద్వారా యువ క్రీడాకారుల శిక్షణకు పటిష్టమైన పునాది ఏర్పడుతుందని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఐటీ విప్లవానికి పునాదులు వేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ గల నాయకుడంటూ కొనియాడారు. సీఎం చంద్రబాబు ఏపీలో క్రీడల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన స్టేడియంలు, పలు శిక్షణ అకాడమీలు ఏర్పాటు చేసి, 2003లో జాతీయ క్రీడలు, ఆఫ్రోఆసియన్ గేమ్స్ నిర్వహించారన్నారు. దీనివల్ల హైదరాబాద్ దేశంలో ప్రముఖ క్రీడా కేంద్రంగా మారిందని వివరించారు.

# విద్య ఉంటే ఏదైనా సాధించవచ్చు

- **మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్, ప్రజాస్వరం**



ప్రజా భవన్ లో రాజీవ్ అభయ హస్త కార్యక్రమంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ సివిల్ అభయహస్తం కార్యక్రమం ప్రారంభించడం చాలాసంతోషం ఉంది. రాజీవ్ గాంధీ సివిల్ అభయ హస్తం ప్రారంభం అయ్యి రెండు సంవత్సరాలు పూర్తి అయింది. గతంలో సింగరేణి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు ఎన్నడూ జరగలేదు. భట్టి విక్రమార్క కి ప్రత్యేక కృతజ్ఞతలని అన్నారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇలాంటి కార్యక్రమం ఎన్నో తీసుకొస్తూ స్కిల్ డెవలప్మెంట్ కోసం యూనివర్సిటీ ఏర్పాటు ఫోర్త్ సిటిలో ఏర్పాటు చేయనున్నాం. పాలిటెక్నిక్,ఐటిఐ సెంటర్లను సిఎస్ఆర్ ఫండ్స్ తో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్గా మార్చి దాదాపుగా 65 సెంటర్లు ప్రారంభించాం. నా నియోజకవర్గంలో 86కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మించాం.... త్వరలో ప్రారంభించబోతున్నాం. ఇంజనీరింగ్ పాస్ అయిన స్కిల్ లేక ఇంటర్వ్యూలో సెలెక్ట్ అవ్వలేకపోతున్నారు...జాబ్ కావాలని మా దగ్గరికి చాలామంది వస్తుంటారు . గ్రామీణ ప్రాంతాలలో నుంచి వచ్చిన వారికి అకాడమిక్లో మెరిట్ ఉన్న స్కిల్స్ లేకపోవడం వల్ల జాబ్ రాలేకపోతుంది. మా ప్రభుత్వం నూతన విద్య విధానం తీసుకొచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచించి 200 కోట్లతో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభిస్తున్నమని అన్నారు.ఒకే దగ్గర అన్ని సామాజిక వర్గాల వారు ఉండే విధంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభించబోతున్నాం. ఇప్పటికే 58 ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరుగుతుంది. విద్య ఉంటే ఏదైనా సాధించవచ్చు అని మా ప్రభుత్వ లక్ష్యం . ఇంత పెద్ద భారతదేశంలో స్పోర్ట్స్ లో గోల్డ్ మెడల్ సాధించలేని పరిస్థితిలో ఉన్నాం....అందుకే మా ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించబోతుందని అన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉన్నా విద్యారంగానికి 22 శాతం పైన బడ్జెట్ కేటాయించాం. నేను ఎంపీగా ఉన్నప్పుడు ఢిల్లీలో నా అపార్ట్మెంట్ సివిల్స్,మెయిన్స్ ప్రిపేర్ అయ్యేవాళ్ళకు ఇచ్చాను.... అందులో చాలామంది సెలెక్ట్ అయ్యారని అన్నారు.అందులో గౌతమి,రాహుల్ ఏసీపీగా సెలెక్ట్ అయ్యి ఉమ్మడి నల్గొండ జిల్లాలో పని చేస్తున్నారు. రాజకీయ నాయకులు ఐదేళ్లు పదేళ్లు ఉంటారు...ఐఏఎస్ ఐపీఎస్ 35,40 ఏళ్లు సర్వీస్ లో ఉంటారు . దేశానికి రాష్ట్రానికి పుట్టిన ఊరికి తల్లిదండ్రులకు గౌరవం తెచ్చే విధంగా, ప్రజల గుండెల్లో నాటుకు పోయే విధంగా మీ రిటైర్మెంట్ తర్వాత ఉండాలి. సివిల్ సర్వీస్ ప్రిపేర్ అయ్యేవారికి మా ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుంది. సివిల్స్ లో అర్హత సాధించిన వారికి అల్ ది బెస్ట్ తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకుని రావాలని కోరుకుంటున్నానని అన్నారు.

# మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ?

- **ధన్‌ఖడ్ రాజీనామాపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షాలు**

**న్యూ డిల్లీ ఆగస్టు 11,ప్రజాస్వరం**



;ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. ఆయన నిర్ణయం అందరినీ షాక్‌కు గురి చేసింది. ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు రాజీనామా తర్వాత నుంచి ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేదు. ఆయన్ని సంప్రదించలేకపోతున్నారు. దీంతో 'జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ..?' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.ఇదే విషయమై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కు లేఖ రాశారు. ధన్‌ఖడ్‌ను తాము చేరుకోలేకపోతున్నామని, ఆయన ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు. ఆయన ఆరోగ్యంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజీనామా చేసినప్పటి నుంచి ధన్‌ఖడ్ గురించి ఎలాంటి సమాచారం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన భద్రతపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది..? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా..? అని ప్రశ్నించారు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ ఎంపీలు ప్రయత్నించినట్లు చెప్పారు. కానీ, ఆయన్ని చేరుకోలేకపోతున్నట్లు వెల్లడించారు. ఆయన ప్రస్తుత లొకేషన్ ఏంటి? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని లేఖలో సంజయ్ రౌత్ పేర్కొన్నారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు జూలై 21న రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.



# పామ్ అయిల్ సాగు విస్తరణకు చర్యలు తీసుకోవాలి

**ములుగు, ;ప్రజాస్వరం**

ములుగు జిల్లా, ఇంచర్ల గ్రామంలో KS బయో సైన్సెస్ ఆయిల్ పామ్ కంపెనీ ప్రారంభోత్సవంలో మంత్రులు సీతక్క, తుమ్మల పాల్గొన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 5 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, మరో 5 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# నాగార్జున సాగర్ 8 గేట్లు ఏత్తివేత

**నల్లగొండ ఆగష్టు 11, ; ప్రజాస్వరం**

నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. సాగర్‌కు వరద ప్రవాహం పెరగడంతో పూర్తి స్థాయి నీటిమట్టానికి జలాశయం చేరింది. ఈ క్రమంలో 8 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి దిగువకు 64,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం ఇన్‌ఫ్లో 65,800 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 1,10,483 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి, ప్రస్తుత నీటిమట్టం 590 అడుగులుగా ఉంది. ఇక సాగర్ పూర్తి, ప్రస్తుత నీటి నిల్వ 312.04 టీఎంసీలుగా ఉంది.





# పిల్లలే జాతీయ సంపద

- **మంత్రి దామోదర**

**హైదరాబాద్, ;ప్రజాస్వరం**

జాతీయ నులిపురుగులు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా హైదరాబాద్ లోని షేక్ పేట లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆల్బెండజల్ టాబ్లెట్స్ ను విద్యార్థులకు అందించారు . జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ , ప్రవేట్ పాఠశాల లతో పాటు అంగన్వాడీలలో సుమారు 98 లక్షల మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు .పిల్లల ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదని మంత్రి దామోదర్ రాజనర్సింహా వెల్లడించారు . పిల్లలే జాతి సంపద అన్నారు , ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలందరూ ఆల్బెండజల్ టాబ్లెట్స్ ను వేసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తదితరులు పాల్గొన్నారు .



# పుణె జిల్లాలోని ఖేడ్ తాలూఖాలో ఘోర రోడ్డు ప్రమాదం

- **వాహనం అదుపు తప్పి లోయలో పడిపోవడంతో ఏడుగురు మహిళలు మృత్యువాత**

**పుణె ఆగస్టు 11, ప్రజాస్వరం**

పుణె జిల్లాలోని ఖేడ్ తాలూఖాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. భక్తులతో ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడిపోవడంతో ఏడుగురు మహిళలు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో 20 మంది గాయపడ్డారు. కుందేశ్వర్ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మహిళలు శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా మహిళలు కుందేశ్వర్‌కు దర్శనం కోసం వెళ్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 1 గంటల సమయంలో కుందేశ్వర్ గుట్ట మొదటి మలుపు తిరుగుతుండగా.. వాహనం అదుపు తప్పి 100 నుంచి 150 ఫీట్ల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు గాయపడిన వారిని వెంటనే చదౌలిలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# కడప లో ఘోర రోడ్డు ప్రమాదం

**కడప,ప్రజాస్వరం**

కడప నగర శివారులోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ కారును ఢీ కొనడంతో అక్కడిక్కడే ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయలైన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.